# పెన్ పవర్

9th - HAPPY - ANNIVERSARY

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 320 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 1 ఆగస్టు 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 320 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 1 AUGUST 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## సచివాలయంలో సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అటవీశాఖ అధికారులతో సమావేశం ముగిసిన తర్వాత పవన్... చంద్రబాబును కలిశారు. ఇరువురు పలు శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.అంతకుముందు చంద్రబాబు... పరిశ్రమల శాఖపై సమీక్ష చేపట్టారు. ఈ సమీక్షలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిశ్రమల శాఖలో గత ఐదేళ్లుగా జరిగిన వ్యవహారాలపై చర్చించారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలు 2019 తర్వాత వెనక్కి వెళ్లారని అధికారులు వివరించారు. పరిశ్రమలకు కేటాయించిన భూములు దుర్వినియోగం అయ్యాయని తెలిపారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ, కంపెనీలను తిరిగి రప్పించేందుకు గట్టిగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించేందుకు వారితో తానే మాట్లాడతానని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భూముల లభ్యత, పారిశ్రామిక అనుకూల ప్రాంతాలపైనా ఈ సమీక్షలో చర్చించారు.

**ఆరోగ్యశ్రీపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవు: మంత్రి కొలుసు పార్థసారథి**

ఆరోగ్యశ్రీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారంటూ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు.

వివరాలు 2లో..

# మైనింగ్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష...

## మైనింగ్‌లో అక్రమాలు.. ప్రభుత్వానికి ప్రైవేటు ఏజెన్సీల బకాయిలు రూ.1025 కోట్లు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మైనింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్లలో మైనింగ్ శాఖ కార్యకలాపాలు, ఆదాయ వనరులపై ఈ సమావేశంలో చర్చించారు. ఇసుక తవ్వకాల్లో ప్రైవేటు ఏజెన్సీలతో ఒప్పందాలపై సమీక్షించారు. ఒప్పందాల ద్వారా అక్రమాలు జరిగాయని, ప్రభుత్వానికి నష్టం జరిగిందని గుర్తించారు. గడచిన ఐదేళ్లలో మైనింగ్ శాఖ ఆదాయం 7 శాతమేనని నిర్ధారించారు. ఇసుక తవ్వకాల్లో ప్రైవేటు ఏజెన్సీలు చెల్లింపులు చేయలేదని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రభుత్వానికి రూ. 1,025 కోట్లు చెల్లించలేదని వెల్లడించారు. అక్రమాలపై కేసులు నమోదు చేశామని సీఎంకు వివరించారు. మైనింగ్ శాఖలో అస్తవ్యస్త విధానాల వల్ల సమస్యలు తలెత్తాయని తెలిపారు. నేటి సమావేశంలో... ఉచిత ఇసుక పాలసీ అమలు, వివిధ ప్రాంతాల్లో ఇసుక లభ్యత, ధరలపై సమీక్షించారు. రవాణా ఖర్చుల వల్ల కొన్ని చోట్ల తక్కువ ధరకు ఇసుక దొరకని అంశంపైనా చర్చించారు. తవ్వకం, రవాణా ఖర్చులు భారం కాకుండా ఎలా వెళ్లాలనే అంశంపై కూడా సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించారు. అవసరం ఉన్న వారు రీచ్ నుంచి నేరుగా ఇసుక తీసుకెళితే భారం ఉండదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఉచిత ఇసుక విధానానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇసుక వినియోగదారులకు భారం కారాదని అధికారులకు నిర్దేశించారు.

## వయనాడ్ ఘటనపై ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేవు



**పెన్ పవర్ డెస్క్:**వయనాడ్ ఘటనపై రాజ్యసభలో కేంద్రమంత్రి అమిత్ షా స్పందించారు. కొండ చరియలు విరిగే పడే అవకాశం ఉందని ఈ నెల 23న కేరళ ప్రభుత్వాన్ని హెచ్చరించామని అమిత్ షా అన్నారు. ముందే హెచ్చరించినా ప్రజలను తరలించడంలో కేరళ ప్రభుత్వం విఫలమైందన్నారు... అమిత్ ప్రకటనకు కేరళ ముఖ్యమంత్రి విజయన్

వివరాలు 2లో..

## బీమా పథకాలపై జీఎస్టీ తొలగించండి..

**నిర్మలా సీతారామన్‌కు నితిన్ గడ్కరీ లేఖ**



- లైఫ్, హెల్త్ ఇన్సురెన్స్ ప్రీమియంలపై జీఎస్టీని తొలగించాలని సూచన
- ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అభ్యర్థన మేరకు ఈ లేఖ రాసినట్లు వెల్లడి
- వీటిపై 18 శాతం జీఎస్టీని విధిస్తున్న కేంద్రం

వివరాలు 2లో..

## ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే



**ఆరోగ్యశ్రీపై కూటమి సర్కారు దుష్ప్రచారం చేస్తోందన్న రజని**

**జనవరి వరకు ఉన్న ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని వెల్లడి**

**గతంలో చంద్రబాబు పెట్టిన బకాయిలు కూడా చెల్లించామని స్పష్టీకరణ**

**పెన్ పవర్ డెస్క్:**ఆరోగ్యశ్రీ పథకంపై కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని వైసీపీ నేత, వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి విడదల రజని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో జనవరి వరకు ఉన్న ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించామని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు పెట్టిన

వివరాలు 2లో..

## కేరళను ముందే హెచ్చరించాం



**వయనాడ్ విషాదం... పార్లమెంట్‌లో అమిత్ షా కీలక ప్రకటన**

**ఈ ముప్పు గురించి జులై 23న అప్రమత్తం చేశామన్న కేంద్రమంత్రి**

**9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించినట్లు వెల్లడి**

**పెన్ పవర్ డెస్క్:**భారీ వర్షాల నేపథ్యంలో కొండచరియలు విరిగిపడే అవకాశాలు ఉన్నాయని తాము కేరళను ముందే హెచ్చరించామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ ముప్పు గురించి కేంద్రం జులై 23నే అప్రమత్తం చేసిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం పౌరులను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించలేదన్నారు. భారీ వర్షాలు

వివరాలు 2లో..

## ఏపీలో రూ.75,000 కోట్లతో బీపీసీఎల్ పరిశ్రమ ఏర్పాటు కాబోతోంది

- పరిశ్రమల శాఖపై సమీక్ష నిర్వహించిన ఏపీ సీఎం చంద్రబాబు
- సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడిన పరిశ్రమల శాఖ మంత్రి భరత్
- బీపీసీఎల్ పరిశ్రమ ఎక్కడ ఏర్పాటు చేయాలనేది 90 రోజుల్లో నిర్ణయిస్తారని వెల్లడి
- సీబీఎన్ బ్రాండ్ తో ఉత్తమ పారిశ్రామిక విధానం అమలు చేస్తామని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ కూడా పాల్గొన్నారు. సమీక్ష ముగిసిన అనంతరం టీజీ భరత్ మీడియాతో మాట్లాడారు. ఏపీకి రూ. 75,000 కోట్లతో బీపీసీఎల్ పరిశ్రమ రాబోతోందని

వివరాలు 2లో..

## మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి బెయిల్ నిరాకరించిన గుంటూరు జిల్లా కోర్టు

- ఎన్నికల వేల సీఐ నారాయణస్వామిపై దాడి, టీడీపీ ఏజెంట్ పై హత్యాయత్నం
- పిన్నెల్లిపై రెండు కేసులు నమోదు
- నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పిన్నెల్లి
- పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై నేడు గుంటూరు జిల్లా కోర్టులో విచారణ



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి న్యాయస్థానంలో మరోసారి చుక్కెదురైంది. గుంటూరు జిల్లా కోర్టు పిన్నెల్లికి బెయిల్ నిరాకరించింది. గతంలో సెషన్స్ కోర్టు పిన్నెల్లి బెయిల్ పిటిషన్ ను తోసిపుచ్చడం తెలిసిందే. ఇప్పుడు గుంటూరు డిస్ట్రిక్ట్ కోర్టులోనూ ఆయనకు నిరాశ తప్పలేదు. ఎన్నికల సమయంలో కారంపూడి సీఐ నారాయణస్వామిపై దాడి, టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి, హత్యాయత్నం చేశారన్న అభియోగాలతో పిన్నెల్లిపై కేసులు నమోదయ్యాయి. ఈ రెండు కేసుల్లో ఆయన రిమాండ్ ఖైదీగా నెల్లూరు జైలులో ఉన్నారు. ఈ రెండు కేసుల్లోనూ బెయిల్ కోరుతూ, పిన్నెల్లి దాఖలు చేసిన పిటిషన్లపై నేడు గుంటూరు జిల్లా కోర్టు విచారణ చేపట్టింది. ఆ రెండు బెయిల్ పిటిషన్లను న్యాయమూర్తి కొట్టివేశారు.

## జగన్ కు దమ్మంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి



**మంగళగిరిలో మంత్రి పార్థసారథి ప్రెస్ మీట్**

**విజన్ లేని వ్యక్తి వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శలు**

**జగన్ అసెంబ్లీకి రాకుండా తప్పించుకుంటున్నారని వ్యాఖ్యలు**

**పెన్ పవర్ డెస్క్:**జగన్ కు దమ్మంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని... వారు ప్రజలకు చేసిన మేలు ఏంటో చెప్పాలని... అసెంబ్లీకి రాకుండా అబద్ధపు పత్రిక, టీవీ పెట్టుకుని గోబెల్స్ ప్రచారం చేయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పార్థసారథి మాట్లాడారు. ప్రజల ఉపాధి పట్ల విజన్ లేని వ్యక్తి వలన రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. నేడు అటువంటి రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, చంద్రబాబు మీద నమ్మకంతో ఇతర రాష్ట్రాల వారు పెట్టుబడులు పెట్టడానికి చూస్తున్నారని వెల్లడించారు.

వివరాలు 2లో..

## ప్రజలు మనవైపే ఉన్నారని లోక్ సభ ఎన్నికల ద్వారా తెలిసింది

**త్వరలో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు ఉన్నాయన్న సోనియా**

**కష్టపడి పని చేస్తే లోక్ సభ ఎన్నికల ఫలితాలే రావొచ్చునని వ్యాఖ్య**

**అతివిశ్వాసం వద్దని కాంగ్రెస్ శ్రేణులకు సూచన**



**పెన్ పవర్ డెస్క్:**లోక్ సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను చూశామని... ప్రజలు మనవైపే ఉన్నారని తెలిసిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అన్నారు. త్వరలో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె దిశానిర్దేశనం చేశారు. ప్రస్తుతం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారని తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో మనకు ప్రజలు మద్దతిచ్చారని గుర్తు చేశారు. అది అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగేలా చూసుకోవాలన్నారు. త్వరలో నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని, వాటికి మనం సమాయత్తం కావాలన్నారు.కష్టపడి పని చేస్తే లోక్ సభ ఎన్నికల ఫలితాలే రావొచ్చునని... కానీ అతివిశ్వాసం మాత్రం వద్దని హెచ్చరించారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ కోల్పోయిందని, అయినప్పటికీ మోదీ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకుండా ప్రజలను వర్గాలుగా విభజిస్తూ, శత్రుత్వాన్ని వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు.కేంద్ర బడ్జెట్‌లో రైతులు, యువతను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. కీలకమైన రంగాల్లో పెండింగ్ పనులకు కేటాయింపుల్లో న్యాయం చేయలేదన్నారు. కావడియాత్రలో విధించిన నియమాలు ఆరెస్సెస్ భావజాలాన్ని వెల్లడిస్తోందని, సుప్రీంకోర్టు సరైన సమయంలో జోక్యం చేసుకుందన్నారు.

# సంపాదకీయం

## పాదాలు అందంగా ఉండాలంటే.. చిట్కాలు ఇవే

అందంగా కనిపించడం కోసం చాలా మంది ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ముఖ్యంగా ఆడవాళ్లు ఈ విషయంలో ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు. మెరిసే చర్మం కోసం ముఖానికి, ఒంటికి క్రీములు, లోషన్‌లు రుద్దుతుంటారు. హెయిర్ కటింగ్‌లో, వస్త్రధారణలో సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. కండ్లకు ఐ లైనర్‌లు, పెదాలకు లిప్‌స్టిక్‌లు అంటూ వేటికీ వెనక్కి తగ్గరు. ముఖంపై ఇంత శ్రద్ధ చూపించే వ్యక్తులు పాదాల సంరక్షణను మాత్రం గాలికి వదిలేస్తుంటారు. అయితే, పాదాల సంరక్షణ ఎలాగో తెలియక కొందరు వదిలేస్తే, ఆ.. కాళ్లు ఎలా ఉంటే ఏందిలే అని మరికొందరు అశ్రద్ధ చేస్తారు. కానీ, కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే పాదాలు అందంగా మృదువుగా ఉంటాయి. ఇప్పుడు ఆ చిట్కాల గురించి తెలుసుకుందాం. .

**పాదాల రక్షణకు ఇంటి చిట్కాలు**

పచ్చిపాలలో రెండు స్పూన్ల చక్కెర కలిపి పాదాలు, అరికాళ్లకు మర్దనా చేయాలి. కాసేపయ్యాక కడిగేసుకుని పెట్రోలియం జెల్లి రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల పొడిబారిన పాదాలకు తేమ అంది మృదువుగా మారతాయి.

నిమ్మరసంలో ఒక స్పూన్ ఉప్పు కలిపి పదినిమిషాల పాటు పాదాలకు మర్దనా చేయాలి. పావుగంట తర్వాత చల్లటి నీళ్లతో కడిగేసుకుని మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

రెండు చెంచాల తేనెలో చెంచా పసుపు కలిపి పాదాలకు పట్టించాలి. అరగంటయ్యాక చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. తేనె పాదాలకు తేమనిచ్చి... మృదువుగా మారుస్తుంది. ఇన్ఫెక్షన్లను కూడా దూరం చేస్తుంది.

ఐదు టేబుల్ స్పూన్ల ఎప్సమ్ సాల్ట్, ఒక కప్పు వైట్ వెనిగర్, గోరు వెచ్చని నీళ్లలో కలపాలి. ఆ నీటిలో పాదాలను పదిహేను నిమిషాలు ఉంచాలి. రోజు రాత్రి పడుకునే ముందు ఈ విధంగా చేస్తే కాలి పగుళ్లు తగ్గుతాయి. అంతేకాదు ఇలా చేయడం వల్ల పాదాల చర్మం మృదువుగా అవుతుంది.

## ప్రమాదంలో కడెం ప్రాజెక్టు.. మూడు గేట్ల నుంచి లీక్ అవుతున్న వరద నీరు



ఎగువ ప్రాంతం నుంచి భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు ప్రమాదకరంగా మారింది. ప్రాజెక్టు నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 690 అడుగులకు చేరుకుంది. ఇప్పుడు మూడు గేట్ల నుంచి వరద నీరు భారీగా లీక్ అవుతుండడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రాజెక్టు గేట్లకు ఇటీవల ప్రభుత్వం రూ. 9 కోట్లతో మరమ్మతులు చేయించింది. అయినప్పటికీ ప్రస్తుతం 13, 14, 15 గేట్ల నుంచి వరద నీరు భారీగా లీక్ అవుతూ వృథాగా పోతోంది. మరమ్మతులు చేపట్టి నెల రోజులు కూడా కాకముందే పరిస్థితి మళ్లీ మొదటికి రావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు మాత్రం చెత్త పేరుకుపోవడం వల్లే వరద నీరు లీక్ అవుతోందని చెబుతున్నారు.

# జగన్ కు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి

- మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీకి రాకుండా తప్పించుకుంటున్న జగన్... ప్రభుత్వంపై అబద్ధపు బురదజల్లుతున్నారని, జగన్ కు దమ్ముంటే రాష్ట్రానికి ఏమి మేలు చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. తాము విడుదల చేస్తున్న శ్వేత పత్రాలు తప్పు అని అసెంబ్లీకి వచ్చి నిరూపించాలని స్పష్టం చేశారు. "వ్యక్తిగత గొడవలు, గంజాయికి అలవాటు పడిన వారు చేసిన మారణకాండపై ఢిల్లీకి వెళ్లి వైసీపీ ధర్నాచేయడం సిగ్గుచేటు. వైసీపీ నేతలు చెప్పేవి వాస్తవాలు అయితే అసెంబ్లీలో చర్చించాలి... దాన్ని వైసీపీ పాంప్లెంట్ పత్రికలో ప్రచురించుకోవాలి. ముఖ్యమంత్రి సవాల్ విసిరితే ఆ సవాల్ ను స్వీకరించలేని దౌర్భాగ్య స్థితిలో వైసీపీ నేతలు ఉన్నారు. పత్రిక, టీవీ ఉందని అబద్దాలు ప్రచారం చేయడం కరెక్ట్ కాదు. ఆరోగ్య శ్రీలో కూడా రూ. 1500 కోట్లు ప్రభుత్వం ఎగ్గొట్టిందని మాట్లాడుతున్నారు. వైసీపీ దుర్మార్గాలు, దుష్ఫలితాల ప్రభావమే ... రాష్ట్రంలో నేడు ఈ పరిస్థితికి కారణం. వైసీపీ పాలనలో ఆసుపత్రులకు చెల్లించాల్సిన పేమెంట్ చెల్లించకపోవడంతో ఆరోగ్య శ్రీ సేవలు నిలిపేస్తూ ఎన్నో సార్లు ఆయా ఆసుపత్రులు ధర్నాకు దిగాయి. వైసీపీ నేతలు చేసిన ఆర్థిక అవకతవకల మూలంగా... ఆఖరికి భోజనాలు సప్లై చేసే వారికి కూడా బిల్లులు ఇవ్వలేని దుస్థితి ఉంది. జగన్ పాలనలో ఎన్నోసార్లు ఆరోగ్య శ్రీ సేవలను కొనసాగించలేమని ఆసుపత్రులు చెప్పాయి. దీంతో ఎంతో మంది పేదలకు ఆరోగ్యం అందలేదు. అబద్దాలు ప్రచారం చేయడం మాని అసెంబ్లీకి వచ్చి వైసీపీ నేతలు చేసిన మేలు ఏదైనా ఉంటే చెప్పుకోవాలి. రాష్ట్ర ఇమేజ్ ను డ్యామేజ్ చేయడానికి అబద్ధాలు ప్రచారం చేస్తే మూల్యం చెల్లించుకుంటారు" అని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

# ఏపీలో రూ.75,000 కోట్లతో బీపీసీఎల్ పరిశ్రమ ఏర్పాటు కాబోతోంది

- మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. బీపీసీఎల్ పరిశ్రమను రాష్ట్రంలో ఎక్కడ ఏర్పాటు చేయాలనేది 90 రోజుల్లో నిర్ణయిస్తారని తెలిపారు.

కృష్ణపట్నంలో బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు విన్ ఫాస్ట్ సంస్థ ముందుకొచ్చిందని వివరించారు. ఏపీలో పెట్టుబడులకు అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ కూడా ఆసక్తి కనబరిచారని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

ఇక, దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక విధానం తీసుకురావాలని నేటి సమీక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉత్తమ ఎంఎస్ఎంఈ, క్లస్టర్ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. సీబీఎన్ బ్రాండ్ తో పారిశ్రామికవేత్తలకు అనుకూల విధానాలు అమలు చేస్తామని వివరించారు. రాష్ట్రంలో నాలుగు ఇండస్ట్రియల్ క్లస్టర్లు ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని టీజీ భరత్ వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో కృష్ణపట్నం, ఏపీ బల్క్ డ్రగ్ పార్క్, ఓర్వకల్లు, కొప్పర్తిలో 4 ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఉన్నాయని వివరించారు. కొత్తగా కుప్పం, లేపాక్షి, దొనకొండ, మూలపేటలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

చిత్తూరు నోడ్ కింద రూ.1,350 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. రాజధాని అమరావతి సమీపంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అని మంత్రి టీజీ భరత్ తెలిపారు.

గతంలో ఏపీలో పెట్టుబడులు పెట్టాలంటే పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితి కల్పించారని మంత్రి టీజీ భరత్ విమర్శించారు. గతంలో పారిశ్రామికవేత్తలను షేర్లు, పర్సంటేజీలు అడిగే పరిస్థితి ఉండేదని తెలిపారు.

# కేరళను ముందే హెచ్చరించాం

- మొదటి పేజీ తరువాయి

కురవగానే 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కేరళకు పంపించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన పార్లమెంట్‌లో ప్రకటన చేశారు.

**180కి చేరిన మృతులు**

కొండచరియలు విరిగిన ఘటనలో మృతుల సంఖ్య 180కి చేరింది. వయనాడ్‌లో సహాయక చర్యల్లో ఆర్మీ పోర్టబుల్ బ్రిడ్జిలను వినియోగిస్తోంది. వీటిని రెండో ప్రపంచ యుద్ధ కాలంలో తొలిసారి ఉపయోగించారు. ఈ బ్రిడ్జిలను హెలికాప్టర్ల సహాయంతో తరలించేందుకు వీలుంటుంది. ఢిల్లీ నుంచి 110 అడుగుల బ్రిడ్జిని తీసుకువచ్చారు. మరో 170 అడుగుల వంతెనను తయారు చేయాలని ఆర్మీ భావిస్తోంది.

# వయనాడ్ ఘటనపై ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేవు

- మొదటి పేజీ తరువాయి

కౌంటరిచ్చారు. వయినాడ్? ఘటన విషయంలో కేంద్రప్రభుత్వం ఎలాంటి ముందస్తు హెచ్చరికలు జారీ చేయలేదని సీఎం విజయన్? అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రకృతి విపత్తును రాజకీయం చేయడం దురదృష్టకరమని అంటూ... ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కేరళ సర్కార్? ను బ్లేమ్? చేయడానికి ఇది సరైన సమయం కాదంటూ.. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎల్లో అలర్ట్? ఉందని కేరళ ముఖ్యమంత్రి విజయన్? అన్నారు.

# ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే

- మొదటి పేజీ తరువాయి

బకాయిలను కూడా తామే చెల్లించామని అన్నారు. జనవరి వరకు తాము చెల్లించిన బకాయిలు పోగా, ఆ తర్వాత ఉన్న బకాయిలను చెల్లించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని రజని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీపై చంద్రబాబు ప్రభుత్వ విధానం ఏంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అప్పులు, బకాయిలు అని దుష్ప్రచారం చేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం నుంచి వైదొలగుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కార్డులు తీసుకోవాలని చెబుతుండడం చూస్తుంటే ఆ అనుమానాలకు బలం చేకూరుతోందని రజని పేర్కొన్నారు. చంద్రబాబు మనసులో ఉన్న మాటనే మంత్రులు చెబుతున్నారా అనే సందేహాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. సాకులు చెబుతూ ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడుస్తున్నారని, ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని కూటమి ప్రభుత్వంపై రజని ధ్వజమెత్తారు. పేదవాళ్ల కోసమే జగన్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు.

# బీమా పథకాలపై జీఎస్టీ తొలగించండి..

**పెన్ పవర్ డెస్క్:** లైఫ్ ఇన్సురెన్స్, హెల్త్ ఇన్సురెన్స్ ప్రీమియంలపై చెల్లించే జీఎస్టీని తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాశారు. నాగపూర్ డివిజనల్ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అభ్యర్థన మేరకు ఈ లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్లాన్స్‌పై జీఎస్టీని విధిస్తుండడంపై పలు వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీఎస్టీని ఉపసంహరించుకోవాలని గడ్కరీ లేఖలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో 18 శాతం జీఎస్టీని విధించిన విషయాన్ని గుర్తు చేశారు. లైఫ్ ఇన్సురెన్స్, హెల్త్ ఇన్సురెన్స్ అనేవి రక్షణ కల్పించడానికి, ప్రమాదాన్ని కవర్ చేయడానికి తీసుకునే పథకాలు అని, ఇలాంటి ప్రీమియంపై పన్ను విధింపు వద్దని గడ్కరీ కోరారు.

# సచివాలయంలో సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ

- మొదటి పేజీ తరువాయి

అబద్ధాలు ప్రచారం చేసే పత్రికలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ పథకంపై తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

బిల్లులు చెల్లించకపోవడంతో గతంలో అనేక ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయని మంత్రి పార్థసారథి వెల్లడించారు. పేదలకు వైద్యం అందకుండా చేసిన అసమర్థ పాలన జగన్ ది అని విమర్శించారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు.

**జలవనరుల శాఖపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష**

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టుకు తాగు, సాగునీరు విడుదలపై చర్చించారు. కృష్ణా బోర్డుకు తెలిపి నీరు విడుదల చేయాలని మంత్రి నిమ్మల అధికారులకు నిర్దేశించారు. తొలుత తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

**నెల్లూరు టౌన్ ప్లానింగ్ విభాగంపై దృష్టి సారించిన మంత్రి నారాయణ**

ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ నెల్లూరు టౌన్ ప్లానింగ్ విభాగంపై దృష్టి సారించారు. భవన నిర్మాణం, లేఅవుట్ల అనుమతుల జారీలో జాప్యం నివారించాలని అధికారులను ఆదేశించారు.

నెల్లూరు కార్పొరేషన్ లోని పెండింగ్ దరఖాస్తులపై రేపు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి నారాయణ, ఉన్నతాధికారులు ఈ స్పెషల్ డ్రైవ్ లో పాల్గొననున్నారు. రేపు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు.


# ప్రపంచమంతా అతడిని ముత్తయ్య మురళీధరన్ అనే అనుకుంది.. వైరల్ అవుతున్న ఈ డ్యాన్స్ వీడియోపై అసలు నిజం ఇదీ!

**ఐపీఎల్‌లో హైదరాబాద్‌కు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న మురళీధరన్**

**బాలీవుడ్ హిట్ సాంగ్ 'తౌబా తౌబా..'కు డ్యాన్స్**

**మురళీ అద్భుతమైన డ్యాన్సర్ అంటూ ప్రశంసలు**

**అసలు విషయం తెలిశాక ఆశ్చర్యపోతూ పోస్టులు**



మణికట్టు మాయాజాలంతో దిగ్గజ బ్యాటర్లను సైతం వణికించిన బౌలర్‌గానే ముత్తయ్య మురళీధరన్ మనకు తెలుసు. ఎన్నో రికార్డులను తన పేరున రాసుకున్న మురళీధరన్ ప్రస్తుతం ఐపీఎల్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)కు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇప్పుడీ క్రికెటర్ గురించి ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందనేగా మీ డౌట్. దానికీ ఓ కారణం ఉంది. సోషల్ మీడియాలో ఓ వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయింది. అందులో మురళీధరన్ బాలీవుడ్ హిట్ సాంగ్ 'తౌబా తౌబా..' పాటకు డ్యాన్స్ ఇరగదీశాడు. ఇంకేముంది.. ఈ స్పిన్ మాంత్రికుడిలో ఈ కళ కూడా ఉందా? అని అభిమానులే కాదు.. క్రికెటర్లు కూడా ఆశ్చర్యపోయారు.

ఈ వీడియో ఇంతగా వైరల్ అయిన తర్వాత తెలిసిందేంటంటే.. అతడు మురళీధరన్ కాదని. అచ్చం మురళీధరన్ కటౌట్‌లానే ఉన్న ఆయన మరెవరో కాదు.. బాలీవుడ్ కొరియాగ్రాఫర్ కిరణ్ జోపాల్. ఈ డాన్స్ వీడియోను అతడే స్వయంగా అప్‌లోడ్ చేశాడు. ఇది చూసిన మురళీధరన్ అభిమానులు అతడే అనుకుని వైరల్ చేశారు.

ఆ వీడియోను చూసిన అందరూ మనోడు మురళీధరనే అనుకున్నారు. యాజ్ ఇట్ ఈజ్‌గా మురళీలానే ఉండడంతో అందరూ అతడు మురళీనే అని భ్రమపడ్డారు. కానీ, అసలు విషయం తెలిశాక అందరూ నోరెళ్లబెట్టారు. 'అవునా.. అతడు మురళీ కాదా!' అని కామెంట్లతో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియో చూశాక మీరు కూడా అతడు మురళీనే అని అనుకుంటారు. కావాలంటే చూడండి!

# బస్సులో అత్యాచారం ఘటన... ఇద్దరు నిందితుల అరెస్ట్

**తనపై అత్యాచారం జరిగినట్లు బాధితురాలు అర్ధరాత్రి ఫిర్యాదు చేశారన్న డీసీపీ**

**నిందితులను నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన వారిగా గుర్తించామని వెల్లడి**

**నిందితులను ఈ రోజు రిమాండ్ చేస్తున్నామన్న డీసీపీ**

సంగారెడ్డి నుంచి ప్రకాశం జిల్లాకు వెళ్తున్న బస్సులో ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సులో జరిగిన అత్యాచార ఘటన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈమేరకు డీసీపీ బాలస్వామి మీడియాతో మాట్లాడుతూ... తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు అర్ధరాత్రి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. హరికృష్ణ ట్రావెల్స్‌కు సంబంధించి నెల్లూరుకు చెందిన ఈర్ల కృష్ణబాబు, ప్రకాశం జిల్లాకు చెందిన సిద్ధయ్య అనే ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేశామన్నారు.సంగారెడ్డి నుంచి వస్తుండగా చేగుంటలో భోజనం చేశారని, అక్కడి నుంచి సిద్ధయ్య బస్సును డ్రైవ్ చేసినట్లు చెప్పారు. కృష్ణబాబు బాధితురాలిని రేప్ చేస్తే... సిద్ధయ్య సహకరించాడన్నారు. బాధితురాలితో మాటలు కలిపి అఘాయిత్యానికి పాల్పడినట్లు చెప్పారు.బాధితురాలు తన కూతురుతో ప్రయాణిస్తోందని, ఒకే బెర్త్ బుక్ చేసుకుందన్నారు. అయితే వెనక్కి వెళ్లాలని నిందితుడు... కూతురుకు చెప్పాడన్నారు. నిన్ననే యాచారం స్టేషన్ పరిధిలో నిందితులను అరెస్ట్ చేశామన్నారు. బాధితురాలి భర్త ఏడేళ్ల క్రితం మరణించినట్లు చెప్పారు. నిందితులను ఈ రోజు రిమాండ్ చేస్తున్నామన్నారు.



# వెనిజులా అధ్యక్షుడు మదురో గురించి సమాచారం అందిస్తే రూ.125 కోట్ల రివార్డు

**మూడోసారి వెనిజులా అధ్యక్షుడిగా ఎన్నికైన మదురో**

**మదురోపై తీవ్రస్థాయిలో అవినీతి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలు**

**కళ్లు చెదిరే రివార్డుతో ప్రకటన విడుదల చేసిన అమెరికా ప్రభుత్వ శాఖ**



వెనిజులా అధ్యక్షుడిగా నికొలాస్ మదురో మొరోస్ మూడోసారి ఎన్నికయ్యారు. అదే సమయంలో అమెరికా ప్రభుత్వం మదురో గురించి సమాచారం అందించిన వారికి కళ్లు చెదిరే రివార్డు ఇస్తామని ప్రకటించింది. మదురోను అరెస్ట్ చేసేందుకు, లేదా అతడిని దోషిగా నిరూపించేందుకు అవసరమైన కీలక సమాచారం అందించిన వారికి రూ.125 కోట్లు నజరానా అందిస్తామని అమెరికా అంతర్జాతీయ నార్కోటిక్స్ అండ్ లా ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో (ఐఎన్ఎల్) ప్రకటించింది. ఫోన్, లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించాలని ఆ మేరకు వివరాలతో కూడిన ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా, ఈ ప్రకటనను వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇది నిజం అంటూ మస్క్ ఆ పోస్టుపై వ్యాఖ్యానించారు. 2013 నుంచి వెనిజులా అధ్యక్షుడిగా కొనసాగుతున్న మదురోపై తీవ్రస్థాయిలో అవినీతి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలు ఉన్నాయి. మదురో తాజాగా ఎన్నికల్లో గెలవగానే, రష్యా అధ్యక్షుడు పుతిన్ అభినందనలు తెలిపారు.


## జీవనకాల గరిష్ఠాలకు చేరువలో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**ఆశాజనక రీతిలో ట్రేడింగ్**

**లాభాలతో కళకళలాడిన సెన్సెక్స్, నిఫ్టీ**

**జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఏషియన్ పెయింట్స్, మారుతి సుజుకి షేర్లకు లాభాలు**

**నష్టాల బాటలో రిలయన్స్, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజాలు**



భారత స్టాక్ మార్కెట్ నేడు లాభాలతో కళకళలాడింది. ట్రేడింగ్ ఆరంభం నుంచే ఆశాజనకంగా కొనసాగిన స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ జీవనకాల గరిష్ఠాలకు చేరువలో ముగిశాయి. సెన్సెక్స్ 285 పాయింట్ల లాభంతో 81,741 వద్ద స్థిరపడగా... నిఫ్టీ 93 పాయింట్ల లాభంతో 24,951 వద్ద ముగిసింది. సెన్సెక్స్ జీవనకాల గరిష్ఠం 81,908 కాగా... నిఫ్టీ జీవనకాల గరిష్ఠం 24,999. ట్రేడింగ్ లో జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఏషియన్ పెయింట్స్, మారుతి సుజుకి, ఎన్టీపీసీ, భారతి ఎయిర్ టెల్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల బాటలో పయనించాయి. రిలయన్స్, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి. మొత్తమ్మీద ఆటోమొబైల్, ఐటీ, ఆర్థిక సేవల రంగం, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, మెటల్ కంపెనీల షేర్లు లాభపడ్డాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు నేడు ప్రతికూల పవనాలు వీచాయి.

## రేవంత్ రెడ్డి ప్రతిపాదన... స్పందించిన తెలుగు పరిశ్రమ

**గద్దర్ అవార్డులపై ప్రతిపాదన చేసిన రేవంత్ రెడ్డి**

**FDCతో చర్చించామన్న తెలుగు ఫిలిమ్ ఛాంబర్, నిర్మాతల మండలి**

**కమిటీని ఏర్పాటు చేయాలని ఎఫ్‌డీసీని కోరినట్లు వెల్లడి**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన గద్దర్ అవార్డులపై తెలుగు ఫిలిమ్ ఛాంబర్ స్పందించింది. ఈ అవార్డులపై ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (%ఖీణజ%)తో చర్చించినట్లు తెలుగు ఫిలిమ్ ఛాంబర్, నిర్మాతల మండలి వెల్లడించాయి. గద్దర్ అవార్డుల కోసం కమిటీని ఏర్పాటు చేయాలని ఎఫ్‌డీసీని కోరినట్లు చెప్పారు. కమిటీ ద్వారా విధి విధానాలను తయారు చేసి ఎఫ్‌డీసీ ద్వారా ప్రభుత్వానికి త్వరలో నివేదిక అందిస్తామని తెలిపారు.టాలీవుడ్‌పై నిన్న సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. గద్దర్ అవార్డులపై తనంతట తానుగా ప్రతిపాదించానని... కానీ సినిమా పరిశ్రమ నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఓ కార్యక్రమంలో అన్నారు. గద్దర్ అవార్డుల అంశంపై సినిమా పరిశ్రమ మౌనంగా ఉందన్నారు. ఇప్పటికైనా సినిమా రంగానికి చెందిన ప్రముఖులు ముందుకు వచ్చి ఈ ప్రతిపాదనపై ఈ కార్యాచరణను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ నేపథ్యంలో టాలీవుడ్ ఈరోజు స్పందించింది.

## యూపీఎస్సీ కొత్త చైర్ పర్సన్ గా ప్రీతి సుడాన్ నియామకం

**ఇప్పటివరకు యూపీఎస్సీ చైర్మన్ గా ఉన్న మనోజ్ సోని**

**ఇటీవల వ్యక్తిగత కారణాలతో రాజీనామా**

**2025 ఏప్రిల్ 29 వరకు యూపీఎస్సీ చైర్ పర్సన్ గా కొనసాగనున్న ప్రీతి సుడాన్**

**ప్రీతి సుడాన్ 1983 బ్యాచ్ ఆంధ్రా క్యాడర్ కు చెందిన ఐఏఎస్ అధికారి**



యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నూతన చైర్ పర్సన్ గా సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రీతి సుడాన్ నియమితులయ్యారు. యూపీఎస్సీ చైర్ పర్సన్ గా ఆమె రేపు (ఆగస్టు 1) బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు యూపీఎస్సీ చైర్మన్ గా వ్యవహరించిన మనోజ్ సోని ఇటీవల రాజీనామా చేశారు. ఆయన పదవీకాలం 2029 వరకు ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాలతో ఆయన పదవి నుంచి వైదొలిగారు. మనోజ్ సోని స్థానంలో యూపీఎస్సీ పగ్గాలు చేపడుతున్న ప్రీతి సుడాన్ ఈ పదవిలో 2025 ఏప్రిల్ 29 వరకు కొనసాగుతారు. ప్రస్తుతం ఆమె యూపీఎస్సీ సభ్యురాలిగా ఉన్నారు. ప్రీతి సుడాన్ 1983 బ్యాచ్ ఆంధ్రా క్యాడర్ కు చెందిన ఐఏఎస్ అధికారి. గతంలో ఆమె జాతీయ స్థాయిలో వివిధ హోదాల్లో సేవలు అందించారు.

## వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ పై జీవితకాల నిషేధం

**పుణే సబ్ కలెక్టర్ గా పనిచేసిన సమయంలో అధికార దుర్వినియోగం ఆరోపణలు**

**యూపీఎస్సీ సెలెక్షన్ సమయంలోనూ తప్పుడు పత్రాలు సమర్పించినట్టు ఆరోపణ**

**భవిష్యత్తులో సివిల్స్ లో పాల్గొనకుండా పూజా ఖేద్కర్ పై నిషేధం**




వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ సెలెక్షన్ ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) రద్దు చేసింది. భవిష్యత్తులో ఆమె సివిల్స్ పరీక్షల్లో పాల్గొనకుండా జీవితకాల నిషేధం విధించింది. పూజా ఖేద్కర్ పుణే ప్రొబేషనరీ సబ్ కలెక్టర్ గా పనిచేసిన సమయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. అంతకుముందు, సెలెక్షన్ సమయంలో యూపీఎస్సీకి తప్పుడు పత్రాలు సమర్పించారని ఆరోపణలు వచ్చాయి. పూజా ఖేద్కర్ మీద వచ్చిన ఆరోపణలపై ఇటీవలే కేంద్రం నియమించిన ఏకసభ్య కమిటీ దర్యాప్తు పూర్తి చేసి, డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ)కి నివేదిక సమర్పించింది. మహారాష్ట్రకు చెందిన వైభవ్ కోకట్ అనే వ్యక్తి చేసిన ట్వీట్ తో పూజా ఖేద్కర్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఖరీదైన ఆడి కారుతో పూజా ఖేద్కర్ ఫొటోను వైభవ్ కోకట్ పోస్టు చేశారు. దాంతో అందరి దృష్టి ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ పైకి మళ్లింది. తీగలాగితే డొంకంతా కదిలినట్టు, ఆమె యూపీఎస్సీ సెలెక్షన్ కోసం చేసిన అక్రమాలు కూడా బయటపడ్డాయి.

## మచిలీపట్నంలో ఆకతాయికి దేహశుద్ధి చేసిన విద్యార్థిని, కుటుంబ సభ్యులు...



మచిలీపట్నంలో విద్యార్థినిని వేధిస్తున్న ఆకతాయికి దేహశుద్ధి జరిగింది. ముగ్గురు కుర్రాళ్లు తనను వేధిస్తున్న విషయాన్ని విద్యార్థిని తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. దాంతో గత మూడ్రోజులుగా ఆమె కుటుంబ సభ్యులు ఆకతాయిల కోసం వెదుకుతున్నారు. ముగ్గురిలో ఒకడు నిన్న కనిపించడంతో... విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులు అతడికి దేహశుద్ధి చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాగా దెబ్బలు తిన్న తర్వాత ఆ పోకిరీ... "సారీ అక్కా" అని చెప్పడం వీడియోలో కనిపించింది. అయితే ఆ విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులు... "నడువు పోలీస్ స్టేషన్ కి" అంటూ అతడిని పోలీసులకు అప్పగించారు.

## సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన కుప్పం వైసీపీ నేతలు

**ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు, 15 మంది ఎంపీటీసీలు టీడీపీలో చేరిక**

**అందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు**

**కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీకాంత్**

**కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్న నేతలు**



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. కుప్పం వైసీపీ నేతలు నేడు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు, 15 మంది ఎంపీటీసీ సభ్యులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పిన చంద్రబాబు టీడీపీలోకి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన కుప్పం నేతలు మాట్లాడుతూ, కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. వైనాట్ 175 అన్నారు... కుప్పంలో రౌడీయిజాన్ని పెంచి పోషించారు.... కుప్పంను సర్వనాశనం చేశారు అంటూ వారు ధ్వజమెత్తారు. కుప్పం నియోజకవర్గంలో గతంలో చంద్రబాబు పట్ల వైసీపీ నేతలు వ్యవహరించిన తీరు కారణంగా ప్రజల్లోనే వ్యతిరేకత వచ్చిందని వివరించారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ, త్వరలోనే మరికొందరు కుప్పం వైసీపీ నేతలు కూడా టీడీపీలో చేరుతున్నారని వెల్లడించారు.

## నూతన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు సీఎం రేవంత్ రెడ్డి స్వాగతం

**శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికిన ముఖ్యమంత్రి**

**స్వాగతం పలికిన సీఎస్, డీజీపీ, త్రివిధ దళాల అధికారులు**

**పంజాబ్ గవర్నర్‌గా కటారియా ప్రమాణ స్వీకారం**



తెలంగాణ నూతన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమానాశ్రయంలో స్వాగతం పలికారు. శంషాబాద్ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం ఇచ్చి ఆయనకు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, త్రివిధ దళాల అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, ఇతర ఉన్నతాధికారులు కొత్త గవర్నర్‌కు స్వాగతం పలికారు. జిష్ణుదేవ్ వర్మ కాసేపట్లో గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

**పంజాబ్ గవర్నర్‌గా గులాబ్ చంద్ ప్రమాణ స్వీకారం**

పంజాబ్ గవర్నర్‌గా గులాబ్ చంద్ కటారియా బుధవారం ప్రమాణం స్వీకారం చేశారు. చండీగఢ్ రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కటారియా చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పంజాబ్ కొత్త గవర్నర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. గవర్నర్ పదవి ద్వారా పంజాబ్ ప్రజలకు సేవ చేస్తానని కటారియా అన్నారు. తనను నియమించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ధన్యవాదాలు తెలిపారు. దాదాపు 45 ఏళ్లపాటు ప్రజాజీవితంలో తాను ఉన్నానన్నారు. ధర్మబద్ధంగా సేవ చేస్తానన్నారు. సామాన్యుల సమస్యలను పరిష్కరించే దిశగా తాను అడుగులు వేస్తానన్నారు. ఎవరైనాసరే వచ్చి తనతో మాట్లాడవచ్చునన్నారు. అందరితో స్నేహపూర్వకంగా మసులుకుంటానన్నారు.

# పారిస్ ఒలింపిక్స్ లో ప్రీక్వార్టర్ ఫైనల్స్ చేరిన తెలుగుతేజాలు పీవీ సింధు, ఆకుల శ్రీజ

**బ్యాడ్మింటన్ గ్రూప్ మ్యాచ్ లో సింధు విజయం**

**21-5, 21-10 తేడాతో ఎస్తోనియా షట్లర్ క్రిస్టిన్ కూబాపై నెగ్గిన సింధు**

**టేబుల్ టెన్నిస్ గ్రూప్ మ్యాచ్ లో సింగపూర్ క్రీడాకారిణిపై నెగ్గిన ఆకుల**



పారిస్ ఒలింపిక్స్ లో తెలుగుతేజాలు పీవీ సింధు (బ్యాడ్మింటన్), ఆకుల శ్రీజ (టేబుల్ టెన్నిస్) ప్రీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ విభాగంలో ఇవాళ జరిగిన గ్రూప్-ఎం మ్యాచ్ లో సింధు 21-5, 21-10తో ఎస్తోనియాకు చెందిన క్రిస్టిన్ కూబాపై అలవోకగా నెగ్గింది. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు ముందు పెద్దగా అనుభవంలేని క్రిస్టిన్ కూబా ఏమాత్రం నిలవలేకపోయింది. కేవలం 34 నిమిషాల్లోనే ఈ మ్యాచ్ ముగియడం చూస్తే సింధు జోరు అర్థమవుతుంది. ఈ విజయంతో సింధు ప్రీ క్వార్టర్ ఫైనల్స్ లో అడుగుపెట్టింది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన సింధు ప్రీ క్వార్టర్స్ లో చైనాకు చెందిన హీ బింగ్జియావోతో తలపడనుంది. ఇక టేబుల్ టెన్నిస్ క్రీడాంశంలో తెలుగమ్మాయి ఆకుల శ్రీజ కూడా ముందంజ వేసింది. టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్ విభాగంలో శ్రీజ ప్రీక్వార్టర్స్ చేరింది. ఇవాళ జరిగిన గ్రూప్ మ్యాచ్ లో శ్రీజ 4-2 తేడాతో సింగపూర్ క్రీడాకారిణి జెంగ్ ను ఓడించింది. ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ ఈవెంట్ లో ప్రీక్వార్టర్స్ చేరిన రెండో భారత క్రీడాకారిణిగా ఆకుల శ్రీజ ఘనత సాధించింది.

# ఎకానమీ క్లాస్‌లో నిద్రపోయిన ద్రావిడ్!

**టీ20 వరల్డ్ కప్ గెలిచిన జట్టుతో ఢిల్లీ వస్తున్న ఫ్లైట్‌లో సందడి వాతావరణం**

**ఏ ఆటగాడూ 6 గంటల కంటే ఎక్కువ సమయం నిద్రపోని వైనం**

**నిద్ర కోసం ఎకానమీ క్లాస్‌కు వెళ్లిన రాహుల్ ద్రావిడ్**



భారత జట్టు టీ20 ప్రపంచకప్ 2024 గెలిచి నెల రోజులైంది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి సుదీర్ఘకాలం తర్వాత మరో టైటిల్‌ను ముద్దాడింది. ఈ విజయం భారతీయ క్రికెట్ అభిమానులను సంతోషంలో నింపింది. కాగా ఫైనల్ విజయం అనంతరం టీమిండియా స్వదేశానికి తిరిగి రావడం కాస్త ఆలస్యమైంది. హరికేన్ కారణంగా విమానాలు రద్దవడంతో జట్టు బార్బడోస్‌లోనే రెండు రోజులు వేచిచూడాల్సి వచ్చింది. ఎట్టకేలకు ప్రత్యేక విమానంలో 16 గంటల పాటు ప్రయాణం చేసి టీమిండియా న్యూఢిల్లీ చేరుకుంది. ఈ విమానంలో టీమిండియా ఆటగాళ్లే కాకుండా.. బార్బడోస్ లో చిక్కుకున్న కొంతమంది జర్నలిస్టులు కూడా ప్రయాణించారు.అయితే ఆ ఫ్లైట్‌లో ఆటగాళ్లు ఎవరూ 6 గంటల కంటే ఎక్కువ సమయం నిద్రపోలేదని ఫ్లైట్ ప్రొడ్యూసర్ ఒకరు వెల్లడించారు. జర్నీకి సంబంధించిన వివరాలు తెలిపారు. కొద్దిసేపు నిద్రపోవాలని భావించిన హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ ఎకానమీ క్లాస్‌లో నిద్రపోవాల్సి వచ్చిందని తెలిపారు."6 గంటల కంటే ఎవరూ ఎక్కువసేపు నిద్రపోలేదని నేను అనుకుంటున్నాను. ఫ్లైట్‌లో ఎవరూ నిశబ్దంగా లేరు. అందరూ ఒకేచోట కలిసి ఉన్నారు. క్రీడాకారులు మీడియా సభ్యులతో మాట్లాడారు. స్టార్ స్పోర్ట్స్ ఇంజనీర్లు ఆ విమానంలో ప్రయాణించారు. వారికి కూడా అదే విమానంలో ప్రయాణ సౌకర్యం కల్పించారు. రోహిత్ శర్మ చాలా సార్లు బిజినెస్ క్లాస్ నుంచి ఎకానమీ క్లాస్‌కు వచ్చి వెళ్తుండేవాడు. ఒక సమయంలో నిద్రపోవాలని భావించిన రాహుల్ ద్రావిడ్ వచ్చి ఎకానమీ క్లాస్‌లో 4-సీటర్ కోసం వెతికారు. కొద్దిసేపు పడుకున్నారు" అని ఫ్లైట్ ప్రొడ్యూసర్ పేర్కొన్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ ఎవరినో సరదాగా తిట్టడం తనకు నిద్రలో వినిపించిందని అన్నారు.

రోహిత్ శర్మ అక్కడే నిలబడి ఉండడం తనకు కనిపించిందని, రోహిత్ తన స్టైల్‌లో సరదాగా తిట్టాడని, ఆ సమయంలో హార్దిక్, రిషబ్ పంత్ వచ్చారని, వారంతా మాట్లాడుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా విశ్రాంతి తీసుకునేందుకు అవకాశం లేకుండా విమానంలో సందడి వాతావరణం కొనసాగిందని దీనిని బట్టి అర్థమవుతోంది.

# చివరి ఓవర్ వేసి మ్యాచ్‌ను టై చేసిన కెప్టెన్ సూర్య..



మంగళవారం రాత్రి భారత్ వర్సెస్ శ్రీలంక మధ్య జరిగిన మూడవ టీ20 మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా ముగిసిన విషయం తెలిసిందే. చివరి ఓవర్‌లో శ్రీలంకకు 6 పరుగులు అవసరమైన సమయంలో ఏ స్టార్ బౌలర్ వచ్చి బౌలింగ్ చేస్తాడో అనుకుంటే.. అనూహ్యంగా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ బంతి అందుకున్నాడు. అప్పటివరకు ఒక్క ఓవర్ కూడా వేయని సూర్య బంతిని అందుకోవడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అయితే కెప్టెన్ నిజంగా అద్భుతం చేశాడు.

**బంతి బంతికి ఏం జరిగిందంటే..**

శ్రీలంకకు 6 పరుగులు అవసరమైన చోట 5 పరుగులే ఇచ్చాడు. దీంతో మ్యాచ్ టై అయింది.

తొలి బంతి డాట్ అవ్వగా.. రెండవ బంతికి కమిందు మెండిస్ ఔట్ అయ్యాడు. ఇక మూడవ బాల్‌కి మహేశ్ తీక్షణ ఔట్ అయ్యాడు. ఇక నాలుగవ బంతికి 1 పరుగు, 5వ బంతికి 2 పరుగులు, 6వ బాల్ కి 2 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత సూపర్ ఓవర్‌లో భారత్ విజయం సాధించింది.

**గంభీర్‌పై ప్రశంసల జల్లు**

కాగా సూర్య కుమార్ యాదవ్ వేసిన చివరి ఓవర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రయోగాత్మకంగా సూర్య, రింకూ సింగ్ బౌలింగ్ చేయడం చూసి 'గౌతమ్ గంభీర్ శకం' మొదలైందని భారత క్రికెట్ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. సూర్య బౌలింగ్ చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గౌతమ్ గంభీర్‌ను అభినందిస్తున్నారు. జట్టులోని ఆటగాళ్లతో విజయవంతమైన ప్రయోగాలు చేస్తున్నాడని ప్రశంసిస్తున్నారు.

# సూపర్ స్టార్లు స్కూల్ కాలేజ్ డ్రాపవుట్లు

పవన్ కల్యాణ్ - ఇంటర్మీడియట్ ఫెయిల్ .. సల్మాన్ ఖాన్ - జూనియర్ కాలేజ్ డ్రాపవుట్ ..అమీర్ ఖాన్ -12 తర్వాత థియేటర్ గ్రూప్ లో చేరాడు ..రణబీర్ - టెంథ్ తర్వాత డ్రాప్ .. అక్షయ్ కుమార్ - జూనియర్ కాలేజ్ డ్రాపవుట్.. ప్రియాంక చోప్రా- కాలేజ్ డ్రాపవుట్ ..ఆలియాభట్ - హైస్కూల్ డ్రాపవుట్.. ఇదే జాబితా లో దీపిక పదుకొనె ..కత్రిన లాంటి తారలు ఉన్నారు. దీపికా పదుకొనే కాలేజీ డ్రాపౌట్.. అక్షయ్ కుమార్ కాలేజీ ని విడిచిపెట్టి చెఫ్ గా మారి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నారు. ఆలియా భట్ తన చదువు ను మధ్యలోనే వదిలేసి సినిమాల్లో కెరీర్ ని సంపాదించుకుంది.

తమదైన అద్భుతమైన ఆన్-స్క్రీన్ పెర్ఫార్మెన్స్ తో అసాధారణ ఫాలోవర్స్ ని సంపాదించుకున్నారు ఈ స్టార్లంతా. ఈ తారలు ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ను ఆస్వాధిస్తున్నారు. వారి విలాసవంతమైన జీవనశైలి కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఒక్కో సినిమా కి కోట్లలో పారితోషికాలు అందుకుంటున్న సెలబ్రిటీల లో చాలామంది కాలేజీ గ్రాడ్యుయేట్లు కూడా కాదనేది ఎందరికి తెలుసు?

కాలేజీ గ్రాడ్యుయేట్లు కాని సెలబ్రిటీల గురించి తెలుసుకునే కొద్దీ ఆసక్తికర విషయాలివి.



**1. అమీర్ ఖాన్**

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ నర్సీ మోంజీ కాలేజీ లో 12వ తరగతి పూర్తి చేసి ఆపై చదువు మానేశాడు. అతను ఒక థియేటర్ కంపెనీ లో చేరాడు. పూర్తి సమయం నటించడం ప్రారంభించాడు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా బాలీవుడ్ లో అమీర్ ఖాన్ ప్రస్థానం గురించి తెలిసిందే.

**2. అలియా భట్**

హార్ట్ ఆఫ్ స్టోన్ చిత్రం తో హాలీవుడ్ లో అడుగుపెట్టేస్తున్న ఆలియా భట్ ఇప్పటికే బాలీవుడ్ ని ఏల్తోంది. భారతదేశవ్యాప్తం గా భారీ ఫాలోయింగ్ ఉన్న మేటి నటి ఆలియా. తాను ఎప్పుడూ చిత్ర పరిశ్రమ లో భాగం కావాల ని కోరుకుందిట. జమ్నాబాయి నర్సీ స్కూల్ లో ఆలియా చదువుకుంది. అయితే సినిమాల్లో కెరీర్ కోసం తన చదువును మధ్యలోనే వదిలేసింది. ఆలియా 12వ తరగతి పరీక్షలు అయినా రాయలేదు.

**3. సల్మాన్ ఖాన్**

బి-టౌన్ భాయిజాన్ కాలేజీ డ్రాపౌట్. అతను గ్వాలియర్ లోని సింధియా స్కూల్ .. ముంబై లోని సెయింట్ స్టానిస్లాస్ హై స్కూల్ లో పాఠశాల విద్యను అభ్యసించాడు. ముంబై లోని సెయింట్ జేవియర్స్ కాలేజీ లో చదువు మానేసిన తర్వాత సల్మాన్ అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసాడు. ఆ తర్వాత హీరో గా అంచెలంచెలుగా ఎదిగి స్టార్ హీరో గా భాయిజాన్ గా ప్రేక్షకాభిమానుల గుండెల్లో నిలిచాడు.

**4. దీపికా పదుకొనే**

దీపిక పదుకొనే క్రీడాకారిణి.. నటి. తన స్వగ్రామం లోని మౌంట్ కార్మెల్ హైస్కూల్ లో చదువుకుంది. ఆ తర్వాత ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ (ఇగ్నో)లో సోషియాలజీ లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ లో చేరింది. అయితే తన మోడలింగ్ కెరీర్ పై దృష్టి పెట్టడానికి దానిని మధ్యలోనే వదిలేసింది.

**5. అక్షయ్ కుమార్**

ముంబై లోని డాన్ బాస్కో హైస్కూల్ లో చదివిన తర్వాత బాలీవుడ్ ఖిలాడీ అక్షయ్ గురునానక్ ఖాల్సా కాలేజీ లో చేరాడు. అయితే అతడు చెఫ్ గా వృత్తిని కొనసాగించాలని.. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని విద్యాభ్యాసం నుంచి తప్పుకున్నాడు.

**6. ప్రియాంక చోప్రా**

ప్రియాంక క్రిమినల్ సైకాలజిస్ట్ కావాలనుకుంది. పాఠశాల విద్య పూర్తి చేసిన తర్వాత పీసీ ముంబై లోని జై హింద్ కాలేజీకి వెళ్లింది. కానీ ఆమె తన మోడలింగ్ వృత్తిని కొనసాగించడానికి స్టడీస్ ని మధ్యలోనే వదిలివేసింది.

**7. రణబీర్ కపూర్**

రణబీర్ 10వ తరగతి స్కోర్ గురించి ఊహించగలరా? అతడి పర్సంటేజీ 54 శాతం.. అంటే యావరేజ్ స్టూడెంట్ అన్నమాట. అయితే ఆ తర్వాత చదువులు కొనసాగించలేదు. రణబీర్ తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి చదువును కొనసాగించడం ఇష్టం లేదని ఉన్నత పాఠశా ల కు వెళ్లనని తెలియజేసాడు. అయితే ఆర్కేకి ఫిల్మ్ మేకింగ్ లో డిప్లొమా ఉంది.

**8. కత్రిన కైఫ్**

చిన్నతనం లో కత్రినా కైఫ్ చాలా తరచుగా ఒక దేశం నుండి మరొక దేశానికి ప్రయాణించింది. ఎందుకంటే ఆమె తల్లి తన జీవితాన్ని సామాజిక కారణాల కోసం అంకితం చేసింది. తత్ఫలితంగా కత్రినకు పాఠశాల విద్యను కొనసాగించడం కష్టంగా మారింది. ఎక్కువగా ఇంట్లోనే చదువుకుంది. దానికి తోడు ఆమెకు మోడలింగ్ ఆఫర్లు రావడం మొదలయ్యాయి. కాబట్టి త్వరగా పాఠశాల ను విడిచిపెట్టి పద్నాలుగేళ్ల వయసులో మోడల్ గా తన వృత్తిని కొనసాగించాలని నిర్ణయించుకుంది.

## నారింజ రంగులో సందీప ధర్ మచ్చలేని లుక్స్



## ఎత్నిక్ వేర్‌లో నిక్కీ తంబోలి అద్భుతమైన ఫోటోషూట్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com